సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

శనివారం 10-8-2024

సంపుటి: 20 సంచిక: 118

పేజీలు: 4 వెల: రూ.1


### సావిత్రమ్మపురంలో
## సెంటు భూమి కూడా కలవలేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాగోలు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 179, 180లో ఉన్న సావిత్రమ్మపురం లేఅవుట్ కు ఆనుకొని ఉన్న కశింకోట కుటుంబీకుల భూమి సెంటు కూడా అన్యాక్రాంతంగా కలవలేదని తెలుస్తుంది. భూమి కశింకోట కుటుంబీకులది కావడం, దాని మీద 49 మంది రైతులు తరాలుగా సాగులో ఉండటం వల్ల ఎవరికీ దాని మీద విక్రయించే హక్కు లేకుండాపోయింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో మధ్యేమార్గంగా రైతులకు, భూ యజమానులకు మధ్య ఒక ఒప్పందం కుదిరి భూములు పంచుకున్న తర్వాత సావిత్రమ్మపురం లేఅవుట్‌కు అవసరమైన కొంత భూమిని హక్కుదారులైన కశింకోట వంశీకులు, రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. తరాల నుంచి సెటిల్ కాని వ్యవహారం ఇప్పుడు తెగడంతో రైతులు, భూ హక్కుదారులు సంతోషిస్తున్నారు.




- నేను రాముడినని చెప్పడంలేదు. నాకూ కొన్ని ఎఫైర్స్ ఉన్నాయ్. కొందరు చెప్పుకుంటారు. కొందరు చెప్పుకోరు. అంతే! ఆ పరిస్థితుల్లో ఆమెకు దగ్గరయ్యాను. **– దువ్వాడ శ్రీనివాస్**
- సొసైటీలో నాకో మగతోడు కావాలి. అది ఆయన ఉంటామంటున్నారు. ఇటు భర్తకీ కాకుండా, అటు శ్రీనివాస్‌కీ కాకుండా ఎటు పొమ్మంటారు? నా మీద జరిగిన రచ్చ వల్ల పడిన మచ్చ పోదు. దాని బదులు శ్రీనివాస్‌తో ఉండటమే బెటర్ కదా. **– దివ్వల మాధురి**
- ఏం చేస్తాడో చేయనీయండి. ఇక్కడే కూర్చుంటాను. నీ స్టేచర్ అదే. దమ్ముంటే బయటకు రా. **– దువ్వాడ వాణి**
- మా నాన్న మాకు కావాలి. మాధురి అన్న మహిళతో మా నాన్న ఉన్నారని విన్నాం. కలవడానికి వెళ్తే లోపలికి రానివ్వడంలేదు. **– దువ్వాడ కుమార్తె**

**ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబంలో మూడు రోజులుగా జరుగుతున్న రచ్చ రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. రెండేళ్లుగా నలుగుతున్న ఈ కథకు ఇది క్లైమాక్సా? ఇంటర్వెల్లా? తెలిపే కథనం త్వరలో..**

# ఎమ్మెల్సీ బరిలో టీడీపీ లేనట్టేనా?

- మంగళవారంతో నామినేషన్లకు ముగింపు
- అరకు, పాడేరు ఓటర్లతో వైకాపా క్యాంప్
- చక్రం తిప్పుతున్న స్వరూప్, శ్రీకాంత్


బెంగళూరు మెట్రోకు వెళ్తున్న సభ్యులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి టీడీపీ తప్పుకున్నట్లే కనిపిస్తుంది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థలన్నీ ఆ పార్టీపరం కావడంతో ప్రస్తుతం ఓట్ల బలం తమకు లేదని గ్రహించిన ఆ పార్టీ బరిలో కూటమి తరఫున అభ్యర్థిని నిలిపేందుకు జంకుతోంది. అధికారంలో ఉన్నా స్థానిక సంస్థల ప్రతినిధులను తమవైపు తిప్పుకునేందుకు సమయం లేకపోవడంతో ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని భావిస్తున్నట్టు ఉంది. ఈ విషయం అన్యాపదేశంగా ఈనాడు కూడా శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై కొన సాగుతున్న సందిగ్ధత అనే శీర్షికన కథనం ప్రచురించింది. ఈనాడు కథనం మేరకు ఎన్నికల్లో పోటీలో ఉండాలా, లేదా అన్నదానిపై ఆరుగురితో కమిటీని నియమించారని, వారు ఇచ్చిన రిపోర్టును బట్టి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. కానీ క్షేత్రస్థాయి గణాంకాలను పరిశీలిస్తే, టీడీపీ బరిలో నిలిచే అవకాశాలు లేవు. ఎందుకంటే.. మంగళవారంతో నామినేషన్లకు గడువు ముగిసిపోతుంది. శనివారం, ఆదివారం నామినేషన్లకు సెలవు కావడంతో, సోమ, మంగళవారాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. కేవలం ఒక్కరోజులో అభ్యర్థిని నిర్ణయించి బరిలో నిలవడం కుదిరే పని కాకపోవచ్చు. అన్నింటికీ మించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎమ్మెల్సీ ఓటరు లెక్క సరిచూసుకున్నప్పుడు టీడీపీ గెలిచే అవకాశాలు కనిపించడంలేదు. పాడేరు, అరకులో ఉన్న ఓటర్లు చేజారిపోకుండా బొత్స సత్యనారాయణ అభ్యర్థిత్వం ప్రకటించిన రోజే ఈ రెండు నియోజకవర్గాల బాధ్యతను జిల్లాకు చెందిన వైకాపా నాయకులు మామిడి శ్రీకాంత్, మెంటాడ స్వరూప్‌లకు అప్పగించారు. దీంతో ఈ రెండు ప్రాంతాల్లో వైకాపా నాయకులను నప్పించి, మెప్పించి రెండు రోజుల క్రితం తాడేపల్లి తీసుకువెళ్లి వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడించారు. అయితే గడిచిన ఐదేళ్లలో తమకు ప్రాధాన్యత దక్కని విషయం, చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వంటి అంశాలు లేవనెత్తడంతో వీరిని మళ్లీ వారి ప్రాంతాలకు పంపిస్తే టీడీపీ కచ్చితంగా హైజాక్ చేస్తుందని స్వరూప్ బొత్స సత్యనారాయణకు చెప్పడంతో ప్రస్తుతం 131 మందితో బెంగళూరులో వైకాపా క్యాంప్ నడుపుతోంది. తాజాగా ఆదివాసీ దినోత్సవం కూడా బెంగళూరు రిసార్ట్‌లోనే జరిపారు. సాధారణంగా బలంగా - మిగతా 4లో


సభ్యులను జగన్‌తో కలిపించిన స్వరూప్




# పాపాల 'కాయ' పండుతోంది!

- -వైకాపా హయాంలో కాయల వెంకటరెడ్డి హవా
- -నిబంధనలను కాలరాసి 80 అడుగుల రోడ్డులో భారీ లేఅవుట్
- -ల్యాండ్ కన్వర్షన్ పూర్తిగా చేయలేదని ఆరోపణలు
- -ప్రభుత్వ, ఇతర వివాద భూములను కలిపేసుకున్నారని ఫిర్యాదులు
- -వాటిని పట్టించుకోకుండా లేఅవుట్‌కు అనుమతులు
- -రూల్స్‌ను అతిక్రమించి రిజర్వ్ స్థలాలపైనా పెత్తనం
- -ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణకు సర్కారు ఆదేశాలు

**వైకాపా హయాంలో అటు ప్రభుత్వం.. ఇటు పార్టీలో కీలకంగా వ్యవహరించి.. సందట్లో సడేమియా అన్నట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నలుదిక్కులా విస్తరించిన నాయకుల గుండెల్లో ఎన్డీయే ప్రభుత్వం రైలు పరిగెత్తిస్తోంది. అటువంటి వారి లావాదేవీలపై దృష్టి సారించి కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడిగా అన్నీ తానై వైకాపాను నడిపించిన కాయల వెంకటరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వేసిన లే అవుట్లపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. జిల్లాలో ఉన్న ప్రాంతీయ విజిలెన్స్ కార్యాలయం పరిధిలోకి వచ్చే విజయనగరంలో మూడింటితోపాటు శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో వేసిన కేవీఆర్ లే అవుట్లపై విచారణ ప్రారంభమైంది. రెవెన్యూ, విజిలెన్స్, మైన్స్, జియోలాజికల్ విభాగాల అధికారులు ఈ విచారణలో భాగస్వాములయ్యారు. కేవీఆర్ లే అవుట్లకు సంబంధించి సుడా, వుడా అనుమతులతో పాటు భూమి కొనుగోలు, సర్వే, గ్రావెల్ తరలింపు, ల్యాండ్ మార్టగేజ్ తదితర అంశాలను తవ్వితీస్తున్నారు.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని 80 అడుగుల రోడ్డులో కేవీఆర్ సంస్థ అభివృద్ధి చేసిన లేఅవుట్‌కు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందారన్న ఆరోపణలున్నాయి. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన వివిధ రకాల రుసుములకు గండికొట్టినట్టు తెలిసింది. రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులతో కుమ్మక్కై అడ్డగోలుగా లే అవుట్ వేసినట్టు కేవీఆర్ సంస్థపై విమర్శలు ఉన్నాయి. లే అవుట్ పేరుతో సేకరించిన భూమిలో ప్రభుత్వ భూమిని కూడా కలిపేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి అధికార పార్టీ నాయకుల అండ, రెవెన్యూ అధికారుల సహకారంతో వివాదాస్పద భూములను లే అవుట్‌లో కలిపేసినట్లు ఏడాది క్రితమే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. భూహక్కుదారులకు తెలియకుండా ఈ తతంగం నడిచిందన్న ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. అరసవల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 475/1,2,3,4,5లలో ఉన్న మొత్తం 18 ఎకరాల భూమిని సేకరించి లేఅవుట్‌గా రూపొందించారు. వ్యవసాయ భూమిగా ఉన్న దాన్ని ల్యాండ్ కన్వర్షన్ (భూ బదలాయింపు) చేయకుండానే అభివృద్ధి పనులు చేపట్టారు. అదే సమయంలో పక్కనే ఉన్న సర్వే నెం. 474/6లో ఉన్న 13 సెంట్ల వివాదాస్పద భూమిని కేవీఆర్ కొనుగోలు చేసినట్టు 2022 డిసెంబర్ 5న - మిగతా 4లో




• ఎడిటోరియల్

# అక్కడ బాల్య వివాహాలు ఇక చట్టబద్ధం!

ముస్లిం దేశాల్లో సహజంగానే మహిళలపై అనేక కట్టుబాట్లు.. సవాలక్ష ఆంక్షల చట్రాలు ఉంటాయి. పురుషులతో సమానంగా మహిళలను గౌరవించే పరిస్థితి చాలా దేశాల్లో లేవు. అయితే అంతర్జాతీయ మహిళాల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యూనిసెఫ్ వంటి ఐక్యరాజ్యసమితికి చెందిన సంస్థలు ఏళ్ల తరబడి చేస్తున్న పోరాటాలు, అవగాహన కార్యక్రమాల పుణ్యాన ఇప్పుడిప్పుడే ఆ దేశాల మహిళలు కొంతవరకు స్వేచ్ఛను అనుభవించగలుగుతున్నారు. ఈ తరుణంలో ఇరాక్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఒక చట్టం ఆ దేశంలో మహిళల హక్కులపై తాజా వివాదానికి తెరలేపింది. బాల్యవివాహం ఒక అనాచారమని, దానివల్ల అనేక దుష్ఫలితాలు ఎదురవుతాయని ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు అంగీకరించే విషయమే. అందుకే బాల్యవివాహాల సంప్రదాయాన్ని నిషేధించి.. స్త్రీపురుషుల వివాహానికి కనీస వయోపరిమితిని విధించాయి. యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలనే నిబంధన దాదాపు అన్ని దేశాల్లోనూ అమల్లో ఉంది. ఇరాక్‌లోనూ అదే వయోపరిమితి ఉన్నా.. ఇప్పుడు అది తగ్గిపోనుంది. ఇరాక్ ప్రభుత్వం యువతీ యువకుల పెళ్లీడు వయసును తగ్గిస్తూ ఆ దేశ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు సర్వత్రా విస్మయానికి, ఆగ్రహానికి గురిచేస్తోంది. అమ్మాయి కనీస వివాహ వయసును తొమ్మిదేళ్లకు, అబ్బాయి వయసును 15 ఏళ్లకు కుదించాలని ఈ బిల్లులో ప్రతిపాదించడం విమర్శలకు గురవుతోంది. ఆ మేరకు పర్సనల్ స్టేట్ లాను సవరిస్తూ ఇరాక్ న్యాయమంత్రిత్వ శాఖ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. ఈ చర్య ఒక విధంగా బాల్యవివాహాలను చట్టబద్ధం చేయడమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. లింగ సమానత్వంతో పాటు ఇప్పటివరకు మహిళా హక్కుల విషయంలో సాధించిన పురోగతిని ఈ బిల్లు మట్టిలో కలిపేస్తుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. యుక్తవయసు వచ్చే వరకు వివాహ వ్యవస్థ, భార్యాభర్తల సంబంధాలు, పిల్లలను కనడం, వారిని పోషించడం వంటి వాటిపై సరైన అవగాహన ఉండదు. అదీగాక చిన్నవయసులోనే పెళ్లిళ్లు చేసేస్తే గర్భం దాల్చడం, ప్రసవం వంటి వాటి వల్ల చిన్నతనంలోనే మహిళల ఆరోగ్యంపై పెను ప్రభావం పడుతుంది. శారీరకంగా వారు దుర్బలులవుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే సనాతనంగా ఉన్న బాల్యవివాహ వ్యవస్థను ఆధునిక యుగంలో రద్దు చేశారు. పెళ్లికి కనీసం వయసును అంతర్జాతీయంగా చట్టబద్ధ పరిమితి విధించారు. ఇప్పుడు ఇరాక్ ఈ పరిమితులను సడలించి మళ్లీ బాల్యవివాహాల దిశగా వెళ్తునట్లు కనిపిస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొంది చట్టం అమల్లోకి వస్తే సమాజంలో అనేక దుష్ఫలితాలు కనిపిస్తాయంటున్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, ఉద్యోగ ఉపాధి రంగాలపై వ్యతిరేక ప్రభావం పడుతుందంటున్నారు. డ్రాపౌట్లు పెరగడంతో పాటు బాల్య వివాహాలు వాటితో పాటు గృహహింస పెరిగిపోతాయని హక్కుల కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. ఐక్యరాజ్య సమితికి యూనిసెఫ్ నివేదికల ప్రకారం ఇప్పటికే ఇరాక్‌లో కనీస వయోపరిమితిని పట్టించుకోకుండా 28 శాతం బాలికలకు బాల్యవివాహాలు చేసేస్తున్నారు. వయోపరిమితి తగ్గిస్తే.. ఇక వాటికి అడ్డూఅదుపూ ఉండదు. ఈ చట్టం దేశప్రగతిని అడ్డుకుంటుందని హ్యూమన్ రైట్స్ వాచ్ పరిశోధకురాలు సారా సన్బర్ వ్యాఖ్యానించారు. ఈ బిల్లులో పలు అభ్యంతరకరమైన నిబంధనలు ఉన్నాయని మానవహక్కుల న్యాయవాదులు చెబుతున్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే కుటుంబ సంబంధిత నిర్ణయాలు, వివాదాల్లో మతపరమైన అధికారులు లేదా పౌర న్యాయవ్యవస్థ జోక్యం పెరిగిపోతుందంటున్నారు. అలాగే వారసత్వం, విడాకులు, పిల్లల సంరక్షణ హక్కులను మహిళలు కోల్పోయే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే ఆరు నెలల్లోగా షియా, సున్నీ ఎండోమెంట్‌లు చట్టపరమైన తీర్పుల కోడ్‌ను రూపొందించి పార్లమెంటుకు సమర్పించాల్సి ఉంటుంది. ఇది వివాహ వ్యవస్థ పర్యవేక్షణను కోర్టుల నుంచి షియా, సున్నీ ఎండోమెంట్ కార్యాలయాలకు అప్పగించేస్తుందని పలువురు వాదిస్తున్నారు. షియా కోడ్ జఫరీ న్యాయశాస్త్రంపై ఆధారపడి ఉంటుంది. ఇది తొమ్మిదేళ్లకే బాలికలకు, 15 ఏళ్లకు బాలురకు వివాహం చేసేందుకు అనుమతిస్తుంది. ఇప్పుడు దీన్నే ఇరాక్ ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. అయితే ఈ బిల్లును సమర్థిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇస్లామిక్ చట్టాలకు అనుగుణంగా ఈ బిల్లును రూపొందించారని చెబుతున్న సమర్థకులు.. దీని ద్వారా అనైతిక సంబంధాల రొంపి నుంచి యువతులను రక్షించడానికి వీలవుతుందని వాదిస్తున్నారు. అయితే పసలేని వాదనలతో బిల్లును సమర్థిస్తున్నవారు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను విస్మరిస్తున్నారని వ్యతిరేకులు విమర్శిస్తున్నారు. బిల్లును ప్రవేశపెట్టిన స్వతంత్ర ఎంపీ రేద్ అల్ మాలికి చరిత్ర కూడా వివాదాస్పదమైనదేనని అంటున్నారు. స్వలింగ సంపర్కం, లింగమార్పిడి శస్త్రచికిత్సలతో పాటు వ్యభిచార నిరోధక చట్టం వంటి వివాదాస్పద సవరణలను ప్రతిపాదించిన చరిత్ర ఆయనకు ఉందని విమర్శిస్తున్నారు. ముసాయిదా బిల్లులో ముస్లిం పురుషులు ముస్లిమేతర మహిళలను వివాహం చేసుకోకుండా నిషేధించడం, వైవాహిక అత్యాచారాలను చట్టబద్ధం చేయడం, భర్త అనుమతి లేకుండా మహిళలు ఇల్లు దాటి బయటకు రాకుండా ఆంక్షలు విధించడం వంటి నిబంధనలు చేర్చడంపై మహిళా సంఘాలు, హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలు దేశాన్ని మళ్లీ వెనుకబాటుతనంలోకి నెట్టివేయడమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



## ఎస్.ఎస్.సి. పూర్తి కాని స్టేజ్ నుంచి..

# ఐపీఎస్ వరకు!

### ఓ గృహిణి ఇంట్రెస్టింగ్ జర్నీ!!

అంబిక 14 సంవత్సరాల వయసులో తమిళనాడులో ఒక కానిస్టేబుల్‌ను వివాహం చేసుకుంది. ఈమె కూడా బాల్య వివాహానికి బలైన వ్యక్తే. కానీ ఏనాడూ వ్యవస్థ మీద అసహ్యం పెంచుకోలే. ఆమెకు 18 సంవ త్సరాలు నిండేసరికి ఇద్దరు ఆడపిల్లల తల్లి. అంబిక భర్త పోలీస్ ఐజీ, డీఐజీ పరేడ్ కోసమని ఒకరోజు పొద్దున్నే లేచి వెళ్లిపోయాడు. ఆమెకి ఐజీ, డీఐజీలకు అధికార లాంచనాలు ఎలా ఉంటాయో తెలుసుకోవా లని ఆశ కలిగింది. భర్త ఇంటికి తిరిగొచ్చాక వాళ్ల గురించి అడిగితే.. వాళ్లు చాలా పెద్దవాళ్లు.. రాష్ట్ర పోలీసు డిపార్ట్‌మెంట్‌లోనే బాసుల స్థాయి అని చెప్పే సరికి తాను కూడా ఆ పదవిలో ఉంటే బాగుండు అని ఆశపడింది.

అంబిక చిన్నప్పుడే పెళ్లి చేసుకుంది కాబట్టి ఎస్‌ఎస్ ఎల్‌సీ కూడా పాస్ కాలేదు. కానీ ఆ పదవిని ఎంత కష్టం అయినా సాదించాలనుకుంది. ఆ విషయం తన భర్తకి చెప్పింది. భర్త కూడ సరే నేను సహకరిస్తాను.. కానీ, ముందు నువ్వు ఎస్ఎస్ఎల్‌సీ పాస్ కా అన్నాడు. కష్టపడి నిద్రహారాలు మాని అటు పిల్లలకు, ఇటు భర్తకు ఓవైపు సేవ చేస్తూనే.. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీ పాసైంది. భర్తని బతిమిలాడి చెన్నైలో ఐపీఎస్ కోచింగ్ తీసుకోవడానికి ఒప్పించింది. ఒప్పుకున్న భర్త ఏర్పాట్లు చేశాడు. భర్త అన్నివేళలా తాను ఏది కావాలన్నా సమకూర్చేవాడు. అలా భర్త సహకారంతో కష్టపడి కోచింగ్ పూర్తిచేసింది.

మూడుసార్లు పరీక్ష రాసినా పాస్ కాలేదు. భర్త కూడా బలవంతంగా ఇంటికి వచ్చేయ్ అన్నాడు. కానీ అంబిక ఇంకా ఒక్క ప్రయత్నం చేస్తాను, అప్పుడు కూడా రాకపోతే వచ్చేస్తానన్నది. దానికి అతను సరే అన్నాడు. ఒకవేళ పాస్ కాకపోతే కనీసం టీచర్ ఉద్యోగమైనా చేయొచ్చనుకుంది. మళ్లీ కష్టపడి చదివి పరీక్ష రాసి నాలుగో సారికి అన్ని టెస్టులు ఒకటేసారి పాస్ అయ్యింది. 2008లో పాస్ అయ్యాక ఆమెను గవర్నమెంట్ ఐపీఎస్ ట్రైనింగ్‌కు పంపింది. ఇప్పుడామె ముంబై నార్త్ జోన్ డీసీపీగా పని చేస్తున్నారు.

అంబికను చూసి మనం చాలా నేర్చుకోవాలి. ఆమె వ్యవస్థను కానీ, బాల్య వివాహం చేసినందుకు తల్లి తండ్రులను గానీ బాధ్యులను చేయలేదు. ఒకటి సాధించాలన్న కచ్చితమైన గురి, మొక్కవోని సంకల్పంతో భర్త సాయంతో ముందుకు పోయి డీసీపీ అయ్యింది.

- గణేష్ తోట



## 12న జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 వర్క్ షాప్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 వర్క్‌షాప్, ఎగ్జిబిషన్ అంబేద్కర్ అడిటోరియంలో ఈ నెల 12న ప్రారంభిస్తున్నట్టు మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 23న చంద్రయాన్ మిషన్–3 విజయానికి గుర్తుగా, విక్రమ్ ల్యాండర్ మృధువైన ల్యాండింగ్, ప్రగ్యాన్ రోవర్ విస్తరణ సందర్భంగా, భారత ప్రభుత్వం ఏటా ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఈ విజయంతో చంద్ర మండలం ఉపరితలంపై అడుగు పెట్టిన నాలుగో స్థానంలో నిలిచిన, చంద్ర మండలం దక్షిణ ధృవం దగ్గర దిగిన మొదటి దేశంగా స్పేస్ ఫెయిరింగ్ దేశాల ఉన్నతవర్గం సమూహంతో భారత దేశం చేరిందన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో మత్స్యకారులు, పడవ యజమానులు, మత్స్యకారుల నేపథ్యం నుంచి విద్యార్థులు, రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు, మత్స్య సహకార సంఘాలు, లబ్ధిదారులు నౌకల నావిగేషన్లో, నౌకల కమ్యూనికేషన్, జీవిత–సహాయక వ్యవస్థపై అవగాహన పొందడానికి, అంతర్జాతీయ సరిహద్దుల్లో చేపల వనరుల లభ్యత, సముద్రపు దొంగల దాడిని నివారించడం, ఆరోగ్య అత్యవసర పరిస్థితి, ప్రతికూల వాతావరణాల కారణంగా పడవలు మునిగిపోవడం తదితర విషయాల్లో నివారించటానికి కావలసిన జ్ఞానాన్ని కూడా పొందగలిగే అరుదైన అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు.

## వయనాడ్‌కు సీపీఎం సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితులకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రూ. 59,650 ఫండ్ వసూలు చేసి పంపినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గసభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యం వల్ల వరదలు కారణంగా నష్టపోయిన వారికి సహాయంగా సీపీఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు శ్రీకాకుళం జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో ఫండ్ రూ.59,650 వసూలు చేసి పార్టీ రాష్ట్ర కేంద్రానికి పంపినట్లు వారు తెలిపారు.






కథానాయికగా అదృష్టాన్ని పరీక్షించుకున్న మెగా ఫ్యామిలీ అమ్మాయి నిహారిక కొణిదెల ఇప్పుడు నిర్మాతగా మారి తీసిన సినిమా.. కమిటీ కుర్రాళ్ళు. కొత్త దర్శకుడు యదు వంశీ రూపొందించిన ఈ చిత్రం.. ఆహ్లాదకరమైన ప్రోమోలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

## కమిటీ కుర్రాళ్ళు

# విషయమున్నోళ్లే!

**సాంకేతికవర్గం:** 'కమిటీ కుర్రాళ్ళు'కు సాంకేతిక నిపుణుల సహకారం కూడా బాగానే కుదిరింది. అందరూ మనసు పెట్టి చేస్తే ఔట్ పుట్ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూడొచ్చు. అనుదీప్ దేవ్ తన సంగీతంతో బలమైన ముద్ర వేశాడు. సినిమా చూసిన వాళ్లందరూ సంగీతం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. ఫీల్ గుడ్ పాటలతో పాటు మంచి నేపథ్య సంగీతం కూడా అందించాడు అనుదీప్. ముఖ్యంగా ఇంటర్వెల్‌కు ముందు ఓ అరగంట అతడి నేపథ్య సంగీతం అదిరిపోయింది. క్రమ క్రమంగా సన్నివేశాల్లో పెరిగే ఇంటెన్సిటీని తన నేపథ్య సంగీతం ద్వారా ప్రేక్షకులు ఫీలయ్యేలా చేయడంలో అతడిది కీలక పాత్ర. రాజు ఎదురోలు ఛాయాగ్రహణం కూడా చాలా బాగా సాగింది. గోదావరి ప్రాంతంలోని పల్లెటూరిని సహజంగా.. అందంగా చూపించాడు. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. ఇలాంటి కథకు మద్దతుగా నిలిచిన నిహారిక అభినందనీయురాలు. రైటర్–డైరెక్టర్ యదు వంశీ.. రాతలో తీతలో తన అభిరుచిని చూపించాడు. తన అనుభవాల నుంచే అతనీ కథను రాసుకున్నాడనిపిస్తుంది. అందుకే సన్నివేశాలు సహజంగా అనిపిస్తాయి. సరదా సన్నివేశాలతో పాటు సీరియస్ సీన్లను కూడా అతను బాగా డీల్ చేశాడు. కాకపోతే ద్వితీయార్ధంలో కథ మీద అతను ఇంకాస్త కసరత్తు చేయాల్సింది. ప్రేక్షకుల అంచనాలకు భిన్నంగా ఈ కథను నడిపించి.. మెలోడ్రామాను ఇంకొంచెం తగ్గించి ఉంటే దర్శకుడి ముద్ర ఇంకా బలంగా ఉండేది.

**కథ:** గోదావరి ప్రాంతంలోని పురుషోత్తమపల్లి అనే ఊరిలో చిన్నప్పట్నుంచి ఏ తారతమ్యాలు లేకుండా సంతోషంగా పెరిగిన పిల్లలంతా కలిసి పెద్దోళ్లవుతారు. యుక్త వయసు వచ్చాక కూడా ఆడుతూ పాడుతూ వారి జీవితం సాగిపోతుంటుంది. ఐతే ఈ బృందంలో ఓ కుర్రాడు ఎంసెట్లో మంచి ర్యాంకు సాధించినప్పటికీ..రిజర్వేషన్ లేకపోవడం వల్ల యూనివర్శిటీలో ఫ్రీ సీట్ రాదు. ఈ విషయమై మిత్రుల మధ్య మొదలైన ఒక చర్చ.. పెద్ద గొడవగా మారుతుంది. దీంతో అన్నేళ్లు సంతోషంగా సాగిపోయిన కుర్రాళ్ల మధ్య కులం గొడవ మొదలై రెండు వర్గాలుగా విడిపోతారు. ఆ ఊరి జాతర సందర్భంగా గొడవ ఇంకా ముదిరి తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఇంతకీ జాతరలో ఏం జరిగింది.. ఆ తర్వాత ఆ కుర్రాళ్ల జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి.. చివరికి మిత్ర బృందం అంతా ఒక్కటైందా లేదా.. అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

"ఆ రోజులే వేరు".. తమ చిన్ననాటి రోజుల్ని.. అలాగే యుక్త వయసులో అనుభవాలను గుర్తు చేసుకుని ఇలా అనుకోని వ్యక్తులు అరుదు. పెరిగి పెద్దయ్యే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా సరే.. స్వచ్ఛంగా చేసిన స్నేహాలు.. స్వేచ్ఛగా తిరిగిన రోజులు గుర్తు చేసుకుంటే ఎవ్వరికైనా నోస్టాల్జిక్ ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగాలు తన్నుకొస్తాయి. సినిమాలకు కూడా ఇదొక మంచి సెల్లింగ్ పాయింట్. ముఖ్యంగా యవ్వనంలో స్నేహితులతో కలిసి పంచుకున్న ముచ్చట్లు.. వేసిన చిలిపి వేషాలు.. అల్లరి చిల్లరి పనులు.. గొడవల్ని గుర్తు చేస్తూ ఓ కథను అందంగా తెరపై ప్రెజెంట్ చేస్తే ఎంత మంచి ఫలితం వస్తుందో 'హ్యాపీ డేస్' సహా ఎన్నో చిత్రాలు రుజువు చేశాయి. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్ళు' కూడా ఇదే బాటలో సాగింది. కాకపోతే ఇందులో మనం చూసేది కుర్రాళ్ల కాలేజీ జీవితాన్ని కాదు. ఒక సగటు పల్లెటూరిలో నడిచే సోషల్– పొలిటికల్ స్టోరీ. ఓ 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లి.. గోదావరి ప్రాంతంలోని ఓ పల్లెటూరి వాతావరణంలో ఓ మిత్ర బృందాన్ని పరిచయం చేసి.. వారి సరదాలు.. అల్లర్లు.. గొడవలు.. రాజకీయాలు.. వీటన్నింటి మధ్య అందంగా.. సహజంగా ఓ కథను ప్రెజెంట్ చేయడానికి ప్రయత్నించాడు కొత్త దర్శకుడు యదు వంశీ. ఓ దశ దాటాక కథలో బలం లేకపోవడం.. సాగతీతగా అనిపించే కొన్ని సీన్లు ఇబ్బంది పెట్టినా.. చాలా వరకు ఎంగేజింగ్ గా అనిపించే కథనం ప్రేక్షకులకు అంతిమంగా మంచి అనుభూతినే మిగులుస్తుంది. "ఆ రోజులు.. మళ్లీ రావు" అంటూ సాగే పాటతో మొదలువుతుంది 'కమిటీ కుర్రాళ్ళు'. ఐతే అందులో చూపించే అంశాలన్నీ రొటీన్‌గా.. కొంచెం డ్రమటిగ్గా అనిపించడంతో ఇదంతా ఎన్నోసార్లు చూసిందే కదా అనే ఫీలింగ్ కలుగుతుంది. కానీ దర్శకుడు నిజాయితీగా ఈ కథను చెబుతున్నాడని కొంచెం ముందుకు వెళ్లాక అర్థమవుతుంది. ఎంతో సహజంగా అనిపించే పాత్రలు.. అందులో చక్కగా ఒదిగిపోయిన నటులు.. ఆహ్లాదం పంచేలా సాగే సన్నివేశాలు.. 'కమిటీ కుర్రాళ్ళు'ను లవబుల్‌గా మారుస్తాయి. ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ అన్నట్లు కాకుండా మిత్ర బృందంలో ప్రతి పాత్రకూ ఏదో ఒక ప్రత్యేకత ఉండేలా వాటిని తీర్చిదిద్దిన తీరు 'కమిటీ కుర్రాళ్ళు'లో మేజర్ హైలైట్. ఒకట్రెండు డైలాగులు చెప్పే పాత్ర సైతం తన ప్రత్యేకతను చాటుకుంటుంది. పేరుకు ఇందులో ఒక హీరో కనిపిస్తాడు కానీ.. మిగతా పాత్రలు దానికి దీటుగా.. ఇంకా చెప్పాలంటే దాన్ని మించి ఉంటాయి. సూర్య.. విలియం.. సుబ్బు లాంటి పాత్రలను దర్శకుడు భలేగా డిజైన్ చేశాడు. సూర్య.. విలియం పాత్రలకు పెట్టిన లవ్ స్టోరీలు సింపుల్ గా ఉంటూనే భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. ఆహ్లాదభరితంగా సాగే ఈ లవ్ ట్రాక్స్.. స్నేహితుల మధ్య సరదా సన్నివేశాలతో 'కమిటీ కుర్రాళ్ళు' మంచి వేగంతో నడుస్తుంది. కథ సీరియస్ రూట్ తీసుకోవడానికి దారి తీసే మలుపు కూడా చాలా బాగుంది. అప్పటిదాకా ఏ అంతరాలు లేకుండా సాగిపోయిన మిత్ర బృందంలో కులం అంశం ఎలా విభేదాలకు దారి తీస్తుందో దర్శకుడు చాలా ఆసక్తికరంగా చూపించాడు. ఒక స్టాండ్ అంటూ తీసుకోకుండానే స్ట్రైకింగ్ డైలాగ్స్‌తో స్నేహితుల మధ్య గొడవ ఎపిసోడ్‌ను రసవత్తరంగా నడిపించాడు. దీన్ని అనుసరించి వచ్చే సన్నివేశాలన్నీ ప్రేక్షకులను చూపు తిప్పుకోనివ్వవు. ఇంటర్వెల్ ఎపిసోడ్ సినిమాకు మేజర్ హైలైట్. విరామ సమయానికి 'కమిటీ కుర్రాళ్ళు' పతాక స్థాయిని అందుకుంటుంది. కానీ మెలోడ్రామా ఒక దశలో శ్రుతి మించింది. ప్రథమార్థంలో అంత ఆహ్లాదంగా కనిపించిన సినిమా.. రెండో అర్ధంలో సెంటిమెంట్ డ్రామాగా మారిపోవడం యువ ప్రేక్షకులను నిరాశపరుస్తుంది. ఎన్నికల ఎపిసోడ్ సైతం అనుకున్నంత ఆసక్తికరంగా లేదు. సెకండాఫ్‌లో పెద్దగా కథ.. కొత్తదనం లేకుండానే మామూలుగా లాగించేసిన ఫీలింగ్ కలుగుతుంది. కాకపోతే రెండో అర్ధంలో కూడా సినిమా బోర్ అయితే కొట్టించదు. ఏదో అలా అలా నడిచిపోతుంది. విరామ సమయానికి ఇచ్చిన హై సెకండాఫ్ లో కూడా కొనసాగి ఉంటే మాత్రం 'కమిటీ కుర్రాళ్ళు' స్పెషల్ ఫిలిం అయ్యేది. కొన్ని లోపాలున్నప్పటికీ ఒకసారి చూసేందుకు మాత్రం ఢోకా లేని సినిమానే ఇది.

**నటీనటులు:** 'కమిటీ కుర్రాళ్ళు'లో సాయికుమార్.. గోపరాజు లాంటి ఇద్దరు ముగ్గురు తప్పితే అందరూ కొత్త వాళ్లు.. పెద్దగా పేరు లేని ఆర్టిస్టులనే చూడొచ్చు. కానీ వీళ్లందరిలో ఎవ్వరూ బాగా చేయలేదు అనడానికి లేదు. చిన్న చిన్న పాత్రలు చేసిన వాళ్లు కూడా తమ ప్రత్యేకతను చాటుకున్నారు. హీరో కాని హీరోలా అనిపించే శివ పాత్రలో చేసిన సందీప్ సరోజ్.. సుబ్బుగా త్రినాథ్ వర్మ.. సూర్యగా యశ్వంత్ పెండ్యాల.. విలియంగా ఈశ్వర్ రచిరాజు.. ఎవరికి వాళ్లే అదరగొట్టేశారు. అందరిలోకి త్రినాథ్ మరింత ప్రత్యేకంగా కనిపిస్తాడు. యూట్యూబర్ గా ఫేమస్ అయిన ప్రసాద్ బెహరా పెద్దోడు అనే పాత్రలో కట్టి పడేశాడు. అతణ్ని సరిగా ఉపయోగించుకుంటే కమెడియన్ గా మంచి పేరు సంపాదించే అవకాశముంది. సాయికుమార్.. గోపరాజు రమణ తమ పాత్రలను బాగా పండించారు. కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ కిషోర్ మరోసారి కన్నీళ్లు పెట్టించేశాడు. మాధురి పాత్రలో చేసిన రాధ్యతో పాటు తేజస్వి.. టీనా శ్రావ్య కూడా బాగా చేశారు. ఇడ్లీ బామ్మ పాత్రలో సీనియర్ నటి శ్రీ లక్ష్మి కూడా మెప్పించింది. మిగతా ఆర్టిస్టులందరూ కూడా ఆకట్టుకున్నారు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...








**నీరజ్..** టోక్యోలో గోల్డ్ గెలిచిన నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్‌లో సిల్వర్ గెలిచి మన దేశ పరువును కాపాడాడు. జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్‌ను గమనిస్తే.. అతడిపై తీవ్రమైన ఒత్తిడి ఉన్నట్లు కనపడింది. టోక్యోలో గోల్డెన్ త్రో వరకు నీరజ్ అంటే ఎవరో దేశంలో 99 శాతం మందికి తెలియదు. అప్పుడు అతనిపై ఎలాంటి ఒత్తడి లేదు. కానీ గోల్డ్ గెలిచాక 140 కోట్ల మంది ఆశలు అతడు భుజన మోస్తూ ప్యారీస్‌లో జావెలిన్ విసరాల్సి వచ్చింది. ఒక అంతర్జాతీయ ఆటగాడు, డిఫెండింగ్ ఛాంపియన్.. ఫైనల్ త్రోలో ఏకంగా ఐదు ఫౌల్స్ చేస్తాడని ఊహించామా? సెకెండ్ త్రో క్లీన్‌గా విసిరాడు కాబట్టే సిల్వర్‌తో పరువు నిలుపుకున్నాడు. కొంత కాలంగా గాయాల పాలవడం, మళ్లీ గోల్డ్ గెలవాలనే తీవ్రమైన ఒత్తిడి అతడు అన్ని ఫౌల్స్ చేయడానికి కారణం అయ్యింది. పైగా పాకిస్తాన్ అథ్లెట్ ఏకంగా ఒలింపిక్ రికార్డు దూరం విసిరి సవాల్ చేశాడు. అది మరింత ఒత్తిడికి గురిచేసి ఉంటుంది. ఏదైతేనేమి మొత్తానికి నీరజ్ దేశానికి సిల్వర్ అందించాడు.

# నీరజ్..నదీమ్..ఓ అమ్మ!

**నదీమ్..** ఇక పాకిస్తాన్ తరపు తొలి వ్యక్తిగత గోల్డ్ గెలిచిన అర్షద్ నదీమ్ ఎలాంటి గడ్డు పరిస్థితుల్లో ఈ పతకం సాధించాడో తెలుసుకుంటే మీ మనసు చలించిపోతుంది. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ఖానేవాల్ గ్రామంలో ఒక జాట్ కుటుంబంలో చౌదరి అర్షద్ నదీమ్ విర్క్ జన్మించాడు. నదీమ్ తండ్రి తాపీ పని చేస్తుంటాడు. 8 మంది సంతానంలో నదీమ్ మూడో వాడు. మన దేశంలో లాగే పాకిస్తాన్‌లో క్రికెట్‌కు తప్ప వేరే ఆటకు ప్రాధాన్యతే ఉండదు. స్కూల్‌లో కూడా క్రికెట్ ఆటవైపే మొగ్గాడు. రబ్బరు బంతితో జిల్లా స్థాయి క్రికెట్ ఆడాడు.

అర్షద్ 7వ తరగతిలో ఉన్నప్పుడు రషీద్ అహ్మద్ సాఖి అనే అథ్లెట్ కంట్లో పడ్డాడు. అథ్లెటిక్స్‌లో సత్తా చాటగలిగే వారిని గుర్తించి..వారిని మెరికెల్లా తీర్చిదిద్దడంలో రషీద్ అహ్మద్‌కు వెన్నతో పెట్టిన విద్య. దీంతో అర్షద్‌ను అథ్లటిక్స్ వైపు తీసుకొని వచ్చాడు. మొదట్లో షార్ట్ పుట్, డిస్కస్ త్రో వంటి ఆటలు ఆడాడు. పంజాబ్ యూత్ ఫెస్టివెల్లో పతకాలు కూడా గెలిచాడు. కానీ అర్షద్ జావెలిన్ త్రో వైపు క్రమంగా మొగ్గుచూపాడు. ఆ ఆటలో ఉన్న మజాను గుర్తించాడు. క్రమంగా ఆ ఆటకే అంకితమైపోయాడు. పాకిస్తాన్‌లో ఖాళీ ఆటస్థలాల్లో క్రికెట్, ఫుట్‌బాల్ ఎక్కువగా ఆడుతుంటారు. అందువల్ల జావెలిన్ త్రో ప్రాక్టీస్‌కు స్థలమే దొరికేది కాదు. దీంతో తన గ్రామంలో ఇంటి దగ్గరే వెనుక ఉన్న పొలాల్లో జావెలిన్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అర్షద్ నదీమ్‌ది పేద కుటుంబం కావడంతో జావెలిన్ కొనడానికి కూడా డబ్బులు ఉండేవి కావు. దీంతో గ్రామస్థులే అతడి టాలెంట్‌ను గుర్తించి డబ్బులు పోగుచేసి అతనికి ఇచ్చారు. ఏ అంతర్జాతీయ పోటీలకు వెళ్లాలన్నా గ్రామస్తులే చందాలు వేసుకొని నదీమ్ చేతిలో డబ్బు పెట్టేవాళ్లు. టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా పాకిస్తాన్ ప్రభుత్వం అతనికి ఎలాంటి సాయం చేయలేదు. పైగా జావెలిన్ అనే సరికి స్పాన్సర్లు కూడా వచ్చేవాళ్లు కాదు. ఎలాగో కష్టపడి టోక్యో వెళ్లాడు. ఫైనల్‌లో 84.62 మీటర్లు విసిరి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ఇక ప్యారీస్ ఒలింపిక్స్ సన్నద్ధతకు కూడా తీవ్రంగా శ్రమించాడు. ప్రాక్టీస్ కోసం సరైన జావెలిన్ కూడా లేదు. దీంతో సోషల్ మీడియా వేదికగా తనకు సాయం చేయాలని కోరాడు. చాలామంది సాయం చేయడంతో ప్రాక్టీస్ ప్రారంభించాడు. టోక్యోలో ఫైనల్ ఓటమి, ఆర్థిక కష్టాలు నదీమ్‌ను మరింత రాటుదేల్చాయి. ఎలాగైనా గోల్డ్ కొట్టాలనే కసితో విసిరాడనుకుంటా.. అందుకే 92.97 మీటర్ల దూరం వెళ్లిందా జావెలిన్. ఫైనల్‌లో రెండుసార్లు 90 మీటర్లు విసిరి తన కసినంతా ప్రదర్శించాడు. జావెద్ గెలిచింది తోటి అథ్లెట్లపై కాదు.. చిన్నప్పటి నుంచి అనుభవించిన పేదరికం, ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం, తనను పట్టించుకోని స్పాన్సర్లపైన. ఇప్పుడు తన చుట్టూ వంద కార్పొరేట్ కంపెనీలు చేరనీ.. ప్రభుత్వం పిలిచి కోటి రూపాయలు ఇవ్వనీ.. అవన్నీ వృధాయే. తన వెన్నంటి ఉన్న గ్రామస్థులు, కుటుంబమే తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పాకిస్తాన్‌కు తొలి గోల్డ్ అందించింది నదీమ్ కాదు. ఆయన పుట్టిన ఊరంతా కలిసి అందించారు.

**అమ్మ..** ప్యారీస్ ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో ఫైనల్ ముగిసిన వెంటనే నీరజ్‌చోప్రా తల్లి దగ్గరకు మీడియా వెళ్లింది. మీ అబ్బాయి టోక్యో లాంటి ప్రదర్శన చేయలేదు కదా.. మీరు ఏమైనా నిరాశకు గురయ్యారా అని అడిగారు. అదేం లేదు.. మాకు ఈ సిల్వర్ కూడా గోల్డ్‌తో సమానం అని చెప్పింది. పాకిస్తాన్ అథ్లెట్ గోల్డ్ గెలిచాడు కదా.. దీనిపై మీ స్పందన ఏంటని ప్రశ్నించగా.. అతను కూడా నా బిడ్డే అని గర్వంగా చెప్పింది. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులు చూస్తే నీరజ్ తల్లి ఇచ్చిన సమాధానాలు ఎంత హుందాగా ఉన్నాయో కదా. అథ్లెట్లకు ఉండే క్రీడా స్ఫూర్తి ఈ తల్లికి కాస్త ఎక్కువగానే ఉన్నట్లు అనిపించింది. టోక్యో ఒలింపిక్స్ సమయంలో కూడా నీరజ్ జావెలిన్‌ను నదీమ్ తీసుకొని ఏదో చేయబోయాడని మీడియాలో వార్తలు వచ్చినప్పుడు కూడా.. నీరజ్ తల్లి ఖండించింది. వాళ్లిద్దరూ మంచి స్నేహితులు, నదీమ్ అలా చేయడు అని వెనకేసుకొని వచ్చింది. ఆ తల్లిలో టోక్యో నుంచి ప్యారీస్ వరకు ఎలాంటి మార్పు చెందలేదు. పైగా మరింత పరిణితి చెందిన వ్యక్తిలా మాట్లాడింది. హ్యాట్సాఫ్.

\- భాయ్‌జాన్

## పట్టణంలో హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికారిక సంస్థ, పర్యాటక శాఖ, శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ర్యాలీ ఏడురోడ్ల జంక్షన్ నుంచి కోడిరామ్మూర్తి స్టేడియం వరకు సాగింది. ర్యాలీని ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీఎస్‌డీవో స్పోర్ట్స్ కె.శ్రీధర్, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్ర అధికారి ఎస్.ఉజ్వల్, ఆర్ట్స్ సన్యాసిరావు, ఇతర జిల్లా అధికారులు, క్రీడా శాఖలోని కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువ కేంద్ర వాలంటీర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

## యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



(సత్యంన్యూస్, రాజాం)

న్యాయపరమైన హక్కుల పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అని యూటీఎఫ్ సీనియర్ నేత ద్వారపురెడ్డి భాస్కరరావు అన్నారు. తెలగవీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ రాజాం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు న్యాయపరమైన సౌలభ్యాలు హరించిననాడు, వెనువెంటనే సదరు హక్కుల సాధనకై పోరాటానికి ఉరికే ఉద్యమ కెరటం యూటీఎఫ్ అని అన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే సందేశాలున్న ఈ యాభై సంవత్సరాల చిహ్నంతో కూడిన జయకేతనాన్ని ఎగురవేసి సంబరాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలను నిలదీసి, ఎన్నో సర్కారు చర్యల ఫలితంగా ఎందరెందరో బలైపోయినా ఉద్యోగ సంక్షేమమే ప్రధాన అజెండాగా దూసుకుపోతున్న చరిత్ర ఏపీ యూటీఎఫ్ సొంతమని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి పక్కి వాసు మాట్లాడుతూ అంకితభావంతో కూడిన ఆశయాల పునాదులపై, కర్తవ్య దీక్షతో కూడిన విధుల నిర్వహణతో నిర్మించబడిన సంఘం యూటీఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మారెళ్ల కృష్ణమూర్తి, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.గౌరీశ్వరరావు, డివిజన్ కార్యదర్శి జి.రమేష్, రాజాం మండల శాఖ అధ్యక్షులు మువ్వల రమేష్, ప్రధాన కార్యదర్శి బలివాడ నాగేశ్వరరావు, వై.భాస్కరరావు, డి.భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, ఆర్.ఉమామహేశ్వరరావు, కె.సూర్యనారాయణ, ఎం.మహేష్, జి.సింహాచలం, సోమశేఖర్, పుండరీకాక్ష, మావూరి శ్రీనివాసరావు, బి.అప్పలస్వామి, పి.బాలకృష్ణ, పి.కృష్ణారావు, జి.విష్ణుమూర్తి, డి.రామారావు, వి.ప్రవీణ్ కుమార్, ఎస్.లక్ష్మణరావు, కె.తిరుపతిరావు, పి.మురళి, రాజాం, జి.సిగడాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 92 మందికి సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళంలో 92 మంది విద్యార్థులకు విప్రో కెరీర్, విప్రో ఫౌండేషన్ వారు సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్స్ ప్రకటించారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం మహిళా కళాశాలలోని 92 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ప్రకటించింది. సంవత్సరానికి రూ.24వేలు చొప్పున మూడేళ్లకు కలిపి మొత్తం రూ.72వేలు విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా అందజేస్తారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, శుభ్రత దాస్ (సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ మేనేజర్ బెంగళూరు), శారద భరద్వాజ్ (ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంతూర్ స్కాలర్షిప్ ఆఫీసర్)లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలలోని వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఆఫీస్ స్టాఫ్ పి.సంతోష్ కుమార్, వి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వక్ఫ్‌బోర్డు నిబంధనల్లో సవరణ ముస్లిమ్ మైనారిటీల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని జిల్లా వైకాపా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.ఎ. బేగ్ పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి సవరణ చట్టాన్ని అమలుచేసి తెలుగు దేశం, దాని మిత్ర పక్షాలు వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టి బలపడే విధంగా ఈ సవరణ చట్టాన్ని తెరపైకి తెచ్చి మైనారిటీల మనోభావాలను దెబ్బతీయటమే ఎన్డీయే ధ్యేయమని నిరూపించారని విమర్శించారు. పార్లమెంట్‌లో వైకాపా ఎంపీలు వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించటంపై హర్షం తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో వక్ఫ్ ఆస్తులు రాష్ట్ర వ్యాప్తంగా అతి విలువైనవిగా ఉండటంతో వాటిని ఆక్రమించేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ముస్లిం మనోభావాలు అర్థం చేసుకుని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వక్ఫ్ చట్టసవరణ బిల్లును వ్యతిరేకించి మరోసారి మైనారిటీల పక్షపాతి అనిపించుకున్నారని, ఈ చట్టాన్ని వ్యతిరేకించిన ఇతర ప్రతిపక్షాలకు కృతజ్ఞత తెలిపారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## విద్యతోనే అభివృద్ధి సాధ్యం




(సత్యం న్యూస్,రాజాం)

### ఆదివాసీలకు అసరాగా నిలిచిన వసంతరావు

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాజాం పట్టణ తెలుగుదేశం ప్రతినిధులు గురువాన నారాయణరావు, నంది సూర్యప్రకాశరావు అన్నారు. ప్రభావతి జాగృతి ట్రస్ట్, తిమ్మయ్యపేట ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు వసంతరావు ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఆదివాసుల సంక్షేమం కొరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి వెళ్లాలని సూచించారు. సామాజిక కార్యకర్త కొత్తా సాయిప్రశాంత్ మాట్లాడుతూ 8 ఏళ్లుగా ప్రభావతి జాగృతి ట్రస్ట్ వ్యవస్థాపకులు వసంతరావు 40 కుటుంబాలు ఉన్న తిమ్మయ్యపేటను దత్తత తీసుకొని వారి బాగోగులను చూసుకుంటున్నారని తెలిపారు. వసంతరావు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని, గ్రామంలోని సమస్యలపైన స్థానిక ఎంఎల్ఏ కొండ్రు మురళీమోహన్, మహిళా శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరంలో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ సుజన 81 మందికి గిరిజనులకు వైద్య సేవలు అందించారు. ఆహ్వానితుల చేతుల మీదుగా 51మంది మహిళలకు చీరలు, నర్సింగ్ చదువుతున్న విద్యార్థినులకు చెరో రూ.1116లు అంద జేశారు. జూజ రమకు ఉపాధికొరకు రూ.6వేలు విలువ చేసే ఎలక్ట్రానిక్ కుట్టుమిషన్లు అందజేశారు. ఆనంతరం గ్రామంలోని ఇద్దరు గిరిజన వృద్ధులు అమిటి ఆశిరన్న దొర, పాలవలస శ్రీరాములకు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలవలస రాము, అమిటి బలరాం, బొండపల్లి రవి, జూజ కార్తీక్, పాలవలస లక్ష్మి, ఆహ్వానితులు శేషపు రమేష్, నల్లా శ్రీనివాసరావు, కమల నాయుడు, బి. రంగనాథం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కళాశాల) సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్సెస్ (గతంలో బయోటెక్నాలజీ విభాగం)లో ఈవిద్యా సంవత్సరం 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి రెండేళ్ల ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌ని అందుబాటులోకి తెచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాధుల నివారణ, నిర్ధారణ, చికిత్సరంగాల్లో సాంకేతిక వినియోగం అద్భుతమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందన్నారు. అప్లైడ్ సైన్సెస్ విభాగం అధిపతి, లెక్చరర్లు డాక్టర్ ఎం. ప్రదీప్, డాక్టర్ ఆర్. హరిత, పి.సుధారాణి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి వైద్యరంగాలలో ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌ని సమర్థవంతంగా నిర్వహించడం కోసం కళాశాల అప్లైడ్ సైన్సెస్ విభాగం, విశాఖపట్నం మెడ్-టెక్ జోన్, స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌లో చేరడం వల్ల టాపర్‌గా నిలిచిన విద్యార్థి పీహెచ్‌డీ చేయడానికి నెలకు రూ. 45 వేలు విలువైన డీఎస్‌టీ ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అవకాశం లభిస్తుందన్నారు. మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన విద్యార్థులందరికీ డీబీటీ బీసీఐఎల్ పారిశ్రామిక శిక్షణ పథకం ద్వారా నెలకు రూ. 12వేలు ఫెలోషిప్‌తో 6నెలల పాటు ఉపాధి నైపుణ్య శిక్షణ అవకాశం ఇవ్వనున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, సెంట్రల్ యూనివర్సిటీలు, ప్రతిష్టాత్మక సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫార్మా కంపెనీలలో తక్షణ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఐసీఎంఆర్ మద్దతు ఉన్న ప్రయోగశాలలలో పీహెచ్‌డీ, పరిశోధనను అభ్యసించే అవకాశాలు, జాతీయ స్థాయి వైద్య సంబంధిత శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పీ.హెచ్.డీ, చురుకైన పరిశోధనల అనుభవం ఉన్న ప్రముఖ అధ్యాపకుల బోధన, కోర్సు పూర్తయిన తర్వాత పీహెచ్‌డీలో చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీఎస్ఐఆర్, యూజీసీ, డీబీటీ, ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్, ఎన్ఈటీ గురించి అవగాహన, కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశం ఉందన్నారు. ఏపీపీజీ సెట్ -2024కి హాజరై అర్హత సాధించిన వారందరూ ఈ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పిజి సెట్-2024లో అర్హత సాధించని, పిజి సెట్-2024కి హాజరుకాని విద్యార్థులు ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌లో చేరాలనుకుంటే రెండవ కౌన్సెలింగ్ తర్వాత అడ్మిషన్ ప్రక్రియ కోసం కళాశాల బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ కోసం 8555911961, 6301096643 సంప్రదించాలన్నారు.

## ఓబీసీ జాబితాలో సొండికులను చేర్చాలి

### - కేంద్రమంత్రిని కలిసిన సంఘం నాయకులు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

సొండీలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కలిసి విన్నవించారు. శుక్రవారం ఢిల్లీలో రామును కలసి ఓబీసీపై చేర్పించారు. సొండి కులాన్ని ఓబీసీలో చేరిస్తే భవిష్యత్‌లో తమ పిల్లలకు మంచి భవిష్యత్ లభిస్తుందని, ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పెరుగుతాయని కేంద్రమంత్రికి సంఘ ప్రతినిధులు విన్నవించారు. దీనిపై స్పందించిన రాము సొండి సామాజికవర్గంతో పాటు మరో నాలుగు సామాజిక వర్గాలను ఓబీసీలో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. కేంద్రమంత్రిని కలసిన వారిలో సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి సాహుకారి నాగేశ్వ రరావు, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## మైనర్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, లైసెన్స్ లేనివారు, మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని పోలీసు అధికారులు కోరారు. ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులు వారి పరిధిలోని కళాశాల, పాఠశాలల విద్యార్థులతో మాట్లాడుతూ ర్యాగింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలపై అవగహన కల్పించారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ప్రయోజకులు అవ్వాలని కోరారు. మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్ధాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు.






-వక్ఫ్ బోర్డుల అపరిమిత అధికారాలకు కొత్త బిల్లుతో కత్తెర

-1995 చట్టానికి 40 సవరణలు ప్రతిపాదించిన కేంద్రం

-ఇది ముస్లిం మత వ్యవహారాల్లో జోక్యమేనని విమర్శలు

-కలెక్టర్లకే సర్వాధికారాలు కల్పించడంపై అభ్యంతరాలు

-ఆస్తులు, అధికారాలు లాక్కోవడానికేనని ఆరోపణలు

# వక్ఫ్ చట్టం.. ఎందుకింత వివాదం?

**వక్ఫ్ చట్టం.. అందులో సవరణలకు కేంద్రం ప్రతిపాదించిన బిల్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బిల్లుకు మద్దతుగా, వ్యతిరేకంగా ఎవరి వాదనలు వారు వినిపిస్తుండటంతో ఇదో పెద్ద వివాదంగా మారింది. లోక్‌సభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు ప్రవేశపెట్టిన సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. తీవ్రవాదోపవాదాల అనంతరం బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపించాలని సభలో నిర్ణయించారు. ఆ మేరకు వివిధ పార్టీలకు చెందిన 21 మంది సభ్యులతో జేపీసీ లోక్‌సభ స్పీకర్ నియమించారు. ఇంతకూ వక్ఫ్ చట్టం ఏమిటి? వక్ఫ్ బోర్డు ఏమిటి? ఆ చట్టంలో కేంద్రం ప్రతిపాదించిన 40 సవరణల ఉద్దేశం ఏమిటి? ముస్లిం సంఘాలు, ప్రతిపక్షాలు ఈ సవరణలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో పరిశీలిద్దాం.**

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

మైనారిటీలుగా ఉన్న ముస్లిం సమాజానికి చెందిన ఆస్తుల పరిర క్షణ, నిర్వహణకు స్వాతంత్ర్యానంతరం 1954లో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని తొలిసారి తీసుకొచ్చింది. కొన్ని దశాబ్దాల తర్వాత 1995లో ఒకసారి, 2013లో రెండోసారి వక్ఫ్ చట్టంలో కేంద్రం కొన్ని సవరణలు చేసింది. ఈ రెండు సవరణలూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-1, 2 ప్రభుత్వాల హయాంలో జరగ్గా తాజాగా మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు మూడుసారి సవరణలు ప్రతిపాదించింది. సుమారు 40 సవరణలతో కూడిన బిల్లును మంత్రి కిరణ్ రిజుజు మూడురోజుల క్రితం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం వక్ఫ్‌బోర్డుకు ఉన్న అపరిమిత, అనియంత్రిత అధికారాలను తగ్గించడం, ప్రాతినిధ్యం లేని ముస్లింలలోని కొన్ని వర్గాలకు, మహిళలకు వక్ఫ్ బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించడం, జిల్లా కలెక్టర్లకు వక్ఫ్ ఆస్తుల సంరక్షణ బాధ్యతలు కట్టబెట్టడం ప్రస్తుత సవరణ బిల్లు ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. గత యూపీఏ ప్రభుత్వాలు చేసిన సవరణలతో వక్ఫ్‌బోర్డుల్లో ఇతర ప్రభుత్వ వ్యవస్థలేవి జోక్యం చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నది కేంద్ర ప్రభుత్వ వాదన. అలాగే సాధారణ ముస్లింలు, ముస్లిం మహిళలు, విడాకులు తీసుకున్న ముస్లిం మహిళల పిల్లలు, షియాలు, బోహ్రాలు వంటివారికి వక్ఫ్‌బోర్డుల్లో చోటు కల్పించాలన్న డిమాండ్‌ను పరిష్కరించడం కూడా ప్రస్తుతం సవరణల లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. అయితే మత సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాలు విమర్శిస్తున్నాయి.

**ఇతర మతసంస్థలకు లేనన్ని అధికారాలు**

లౌకిక దేశంగా చెప్పుకొనే భారత్‌లో ఇతర ఏ మత సంస్థలకూ లేని అధికారాలు ముస్లిం సంస్థ అయిన వక్ఫ్ బోర్డుకు ఎందుకు కల్పించారని ముస్లిమేతరులు ప్రశ్నిస్తున్నారు. దేశంలో 30 వక్ఫ్ బోర్డులు ఉంటే వాటి పరిధిలో సుమారు 9.4 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని అంచనా. వాటి విలువ సుమారు 1.20 లక్షల కోట్లు ఉంటుందంటున్నారు. ఈ ఆస్తుల నుంచి ఏటా సుమారు రూ.200 కోట్ల ఆదాయం బోర్డుకు లభిస్తోంది. దేశంలో రక్షణ, రైల్వే శాఖల తర్వాత అత్యధిక ఆస్తులు కలిగిన సంస్థ వక్ఫ్ బోర్డు మాత్రమేనని, కానీ ఈ ఆస్తుల నిర్వహణలో జోక్యం చేసుకునే అధికారం ఏ ప్రభుత్వ వ్యవస్థకు లేకుండా చేశారన్న విమర్శలు ఉన్నాయి. సౌదీ అరేబియా, ఒమన్ వంటి ముస్లిం దేశాల్లోనూ ఇన్ని ఆస్తులు, ఇన్ని అధికారాలు ముస్లిం సంస్థలకు లేవని అంటున్నారు. ఏదైనా భూమిని లేదా ఆస్తిని తమదిగా వక్ఫ్ బోర్డు ప్రకటిస్తే.. ఇక ఆ నిర్ణయాన్ని మార్చే శక్తి ఎవరికీ ఉండదు. చివరికి కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాలు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోలేవు. ఇదేఅదనుగా కేవలం 200 మంది ముస్లిం పెద్దలు దేశంలోని వక్ఫ్ బోర్డులను, ఆస్తులను తమ గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో జస్టిస్ సచార్ కమిషన్, రెహమాన్ ఖాన్ నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు అప్పటి కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను ఉపసంహరించుకోవడంతో కొత్త కొన్ని అంశాలు చేర్చడమే ప్రస్తుతం కేంద్ర ప్రతిపాదించిన బిల్లు ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేస్తోంది.

**బిల్లులో ప్రతిపాదించిన కొన్ని సవరణలు**

-ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకునేందుకు వీల్లేదు. కొత్త చట్టం అమల్లోకి వస్తే వక్ఫ్‌బోర్డులు తమ ఆస్తులను జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (కలెక్టర్) కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది, అలాగే ఆదాయ, వ్యయాల వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది.

-బోర్డు స్వరూపాన్ని మార్చడంతో పాటు అందులో కొత్తగా మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తారు. రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు చొప్పున మహిళా సభ్యులు ఉంటారు.

-వక్ఫ్ బోర్డుకు చెందిన వివాదాస్పద, పాత ఆస్తులను కొత్తగా పరిశీలిస్తారు. వక్ఫ్ బోర్డు లేదా ఎవరైనా వ్యక్తులు క్లెయిములు, కౌంటర్ క్లెయిములు చేసిన ఆస్తులకు కొత్త సవరణ వర్తిస్తుంది. ప్రతిపాదిత చట్టం ప్రకారం.. వక్ఫ్ బోర్డు చేసే అన్ని క్లయిమ్‌లను తప్పనిసరిగా, పారదర్శకంగా ధృవీకరించాల్సిందే.

-వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 19, 14లలో మార్పులు చేస్తారు. దీనివల్ల సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు రూపురేఖలు మారే అవకాశం ఉంది.

-వక్ఫ్ బోర్డు నిర్ణయాన్ని ఇప్పుడు హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఈ నిబంధన లేదు. 1995 చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం ఒక భూమిని తనదిగా వక్ఫ్ ప్రకటిస్తే అది ఆ బోర్డుకే వెళ్లిపోతుంది. దాన్ని కోర్టులోనూ సవాలు చేసే పరిస్థితి లేదు. ఇది పిటిషనర్‌కు న్యాయ వ్యవస్థ నుంచి న్యాయం కోరకుండా నిరోధిస్తోంది. దేశంలో మరే మత సంస్థకూ ఇలాంటి అధికారాలు లేవు.

-వక్ఫ్ ఆస్తులను పేద ముస్లింల ప్రయోజనం కోసం ఉపయోగించాలి. కానీ పరిస్థితి అలా లేదు. పలుకుబడి ఉన్న ముస్లిం పెద్దలు ఈ ఆస్తులను తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు గుర్తించారు. పలు ఆస్తులను బలవంతంగా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించడంపై కూడా వివాదం ఉంది. ఆస్తుల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు కల్పిస్తున్నారు.

-పిల్లలు కలిగి ఉన్న ముస్లిం మహిళ భర్త నుంచి విడాకులు తీసుకుంటే ఆమెతోపాటు బిడ్డల పోషణకు ప్రత్యేక ఏర్పాటు లేదు. కొత్త బిల్లులో దానికి అవకాశం కల్పిస్తున్నారు.

**వక్ఫ్ అంటే ఏమిటి?**

వక్ఫ్ అనేది అరబిక్ పదం. దీని అర్థం 'ఆపడం' లేదా 'లొంగిపోవడం'. ఇస్లాంలో వక్ఫ్ ఆస్తిని శాశ్వత మత, ఛారిటబుల్ ట్రస్ట్‌కు అంకితం చేస్తారు. ఈ ఆస్తులను మతపరమైన కార్యక్రమాలకు, పేదలకు, విద్య తదితర అవసరాలకు ఉపయోగిస్తారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు ప్రతి రాష్ట్రంలో వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇవి వక్ఫ్ ఆస్తులను రిజిస్టర్ చేసి, సంరక్షించడంతోపాటు వాటిపై లావాదేవీలను నిర్వహిస్తాయి. వక్ఫ్ చట్టం ప్రకారం అన్ని వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఈ రిజిస్ట్రేషన్ సంబంధిత రాష్ట్ర వక్ఫ్ బోర్డులోనే జరుగుతుంది. ఈ ఆస్తులపై నియంత్రణ అధికారం వక్ఫ్ బోర్డుకే ఉంది. వీటిని బోర్డు పరిధిలో ముతవల్లీ(మేనేజర్)లు పర్యవేక్షిస్తుంటారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశారు. అన్ని వివాదాలను ఈ కోర్టు పరిష్కరించేలా 1995లో చేసిన సవరణల ద్వారా అధికారం కల్పించారు. ఈ అధికారాలన్నింటినీ తాజా సవరణ బిల్లు ద్వారా లాగేసుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**అభ్యంతరాలేమిటి?**

కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరేసి ముస్లిం మహిళలకు చోటు కల్పించడం ముస్లిం వర్గాలు ప్రధాన అభ్యంతరాల్లో ఒకటి. అలాగే ముస్లిమేతరులకూ స్థానం కల్పించడం. ఇద్దరు లోక్‌సభ, ఒక రాజ్యసభ సభ్యులకు కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో చోటు కల్పిస్తారు. ఈ ముగ్గురు ముస్లింలే అయ్యుండాలనే నిబంధనేమీ లేదు. పాత చట్టం ప్రకారం తప్పనిసరిగా ముస్లిం ఎంపీలకే కౌన్సిల్‌లో చోటు ఉండేది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ స్వరూపాన్ని ఎప్పుడైనా మార్చే అధికారాన్ని తాజా బిల్లు కేంద్రానికి కట్టబెడుతోంది.

-ఒక ఆస్తి వక్ఫ్‌కు చెందినదా.. ప్రభుత్వానిదా అనే వివాదం తలెత్తితే దానిపై నిర్ణయాధికారాన్ని కొత్త కలెక్టర్లకు కల్పించింది. వక్ఫ్ చట్టం-1995లోని సెక్షన్-6 ప్రకారం ప్రస్తుతం ఇలాంటి వివాదాల్లో వక్ఫ్ ట్రిబ్యునళ్లు తీర్పులిస్తున్నాయి. దీనివల్ల అక్రమంగా ఆస్తులు దక్కించుకోవడానికి స్వార్థపరులు ట్రిబ్యూనళ్లను అడ్డం పెట్టుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

-బోరాలు, అగాఖానీల కోసం ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డు ఏర్పాటు చేస్తారు. వక్ఫ్ బోర్డుల్లో షియాలు, సున్నీలు, బోరాలు, ఆగాఖానీలు, ముస్లింలోని ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా కొత్త బిల్లులో ప్రతిపాదించారు.

-తన ఆస్తిని దానంగా ఇవ్వడానికి ఒక వ్యక్తి సిద్ధపడినపుడు.. అతను రాసిన చెల్లుబాటయ్యే అంగీకారపత్రాన్ని (వక్ఫ్‌నామా) కొత్త బిల్లు తప్పనిసరి చేస్తోంది. ప్రస్తుతం ఒక వ్యక్తి మౌఖికంగా కూడా తన ఆస్తిని వక్ఫ్‌కు ఇచ్చేసే పరిస్థితి ఉంది.

-ఒక ఆస్తి వక్ఫ్‌కి చెందినదా? కాదా? అని నిర్ణయించే హక్కు వక్ఫ్ బోర్డుకు ఉండదు. కొత్త ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం ఉన్న ముగ్గురు సభ్యుల వక్ఫ్ ట్రిబ్యూనల్ ఇద్దరు సభ్యులకే పరిమితం కానుంది. ఈ ట్రిబ్యూనల్ నిర్ణయాలు కూడా అంతిమం కావు. ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని 90 రోజుల్లో హైకోర్టులో సవాల్ చేయొచ్చు.

-కేంద్రం ప్రతిపాదించిన ఒక సవరణ వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత గందరగోళంగా మారుస్తుందంటున్నారు. ఇప్పటికే అనేక బాధ్యతల భారంతో పని చేస్తున్న కలెక్టర్లు లేదా డిప్యూటీ కమిషనర్లు వీటిపై దృష్టి సారించే అవకాశం ఉండదని, దాంతో వివాదాల ఆస్తుల నిర్ధారణ, వివాదాల పరిష్కారంలో జాప్యం జరుగుతుందంటున్నారు.

# పాపాల 'కాయ' పండుతోంది!

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణకుమారి, అపర్ణ అనే ఇద్దరు మహిళలు స్పందనలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా ఉమ్మడి ఆస్తిని రీసర్వేలో వేరొకరి పేరిట మార్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అండగల్ జనరేట్ కాకుండా నిలిపివేసి సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించాల్సిన మండల రెవెన్యూ అధికారులు లేఅవుట్ యజమానికి అనుకూలంగా వ్యవహారం నడిపించారు.

**అక్రమంగా గ్రావెల్ తరలింపు**

ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండగానే లేఅవుట్‌కు సేకరించిన భూమిలో కొన్నివేల మెట్రిక్ టన్నుల గ్రావెల్‌ను అక్రమంగా డంప్ చేశారు. దీనిపైనా ఫిర్యాదులు అందడంతో పలాస నుంచి గ్రావెల్ తరలిస్తున్నట్టు బిల్లులు సృష్టించి శ్రీకాకుళం పరిధిలో ఉన్న కొండల నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలించారు. రూ.లక్షల విలువైన గ్రావెల్‌ను శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల ప్రాంతాల నుంచి తరలిస్తునట్టు ఫిర్యాదులు అందిన ప్రతిసారీ మైన్స్, రెవెన్యూ అధికారులు హడావుడి చేస్తూ వచ్చారు. మైన్స్ అధికారుల కనుసన్నల్లోనే వైకాపా నాయకులు సహజ వనరులను దోపిడీ చేసి సుమారు 10వేల మెట్రిక్ టన్నుల గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. ఈ సందర్భంలోనే గ్రావెల్ తరలింపునకు వినియోగించిన డంపర్ కేవీఆర్ లేఅవుట్ మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి కాలి బూడిదైంది. ఈ వ్యవహారం వెలుగులోకి రాకుండా పోలీసులను మేనేజ్ చేశారు. ఇన్సూరెన్స్ కోసం కాలిపోయిన డంపర్ బయటకు కనిపించకుండా పచ్చటి పరదా కప్పేశారు.

**కన్వర్షన్ చేయకుండా మేనేజ్ చేశారు**

ఎన్నో మతలబుల మధ్య వేసిన కేవీఆర్ లే-అవుట్‌లో సర్వే నెంబర్ 475/ 1,2,3,4,5లలో కేవలం తొమ్మిది ఎకరాలకు మాత్రమే ల్యాండ్ కన్వర్షన్ చేయించారు. మిగతా తొమ్మిది ఎకరాలకు ల్యాండ్ కన్వర్షన్ చేయించకుండానే మొత్తం 18 ఎకరాల్లో లే అవుట్ వేసి చుట్టూ ప్రహరీ నిర్మించేశారు. కన్వర్షన్ చేయించని తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూమికి రీసర్వే కూడా జరగలేదు. రీసర్వే కోసం డ్రోన్ ఎగురవేసినా సాంకేతిక కారణాల వల్ల డిజిటలైజేషన్ కాలేదు. దాంతో కేవీఆర్ కొనుగోలు చేసినట్టు చెబుతున్న తొమ్మిది ఎకరాలను లే అవుట్‌గా మార్చే అవకాశం లేదు. ఇక కన్వర్షన్ కోసం నాలా పన్ను కట్టిన తొమ్మిది ఎకరాల్లో 13 సెంట్ల వివాదాస్పద భూమితో పాటు ప్రభుత్వానికి చెందిన 20 సెంట్ల భూమి ఉన్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. అక్రమాన్ని సక్రమం చేసుకోవడానికి అప్పటి తహసీల్దార్‌కు లేఅవుట్‌లో సుమారు రూ.80 లక్షలు విలువ చేసే మూడు సెంట్ల ప్లాట్ ఇచ్చినట్టు తెలిసింది. ఆ ప్లాట్‌ను సదరు రెవెన్యూ అధికారి తన బంధువుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతలోనే ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో తొమ్మిది ఎకరాల భూమి రీసర్వే కాకుండా నిలిచిపోయింది. దాంతో రీసర్వేలో వివాదాస్పద ప్రభుత్వ భూమిని జిరాయితీగా చూపించి ల్యాండ్ కన్వర్షన్‌కు ఇబ్బంది లేకుండా కేవీఆర్ సంస్థ చేసిన ప్రయత్నం విఫలమైంది. ముందుగా సేకరించిన తొమ్మిది ఎకరాలకు కన్వర్షన్ ఫీజు చెల్లించి లే అవుట్ కోసం సుడా నుంచి అనుమతులు పొందారు. సుడా నిబంధనల మేరకు తొమ్మిది ఎకరాల లేఅవుట్‌లో పది శాతం అంటే 90 సెంట్ల రిజర్వు స్థలం కేటాయించారు.

**రిజర్వ్ స్థలాల్లోనూ సొంత ప్రయోజనాలు**

పార్కుల నిర్మాణం, ఇతర సామాజిక అవసరాల కోసం ఆ 90 సెంట్లను నగరపాలకసంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. కాగా నిబంధనల ప్రకారం 90 సెంట్ల రిజర్వు స్థలం అంతా ఒకేచోట ఉండాలి. కానీ దాన్ని తుంగలో తొక్కి నాలుగు వేర్వేరు చోట్ల రిజర్వు స్థలం చూపించినా సుడా అధికారులు అడ్డు చెప్పలేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌కు సుడా అధికారులు అనుమతి ఇచ్చేశారు. నాలుగు చోట్ల ఉన్న 90 సెంట్ల రిజర్వు స్థలాన్ని లేఅవుట్ యజమానే అభివృద్ధి చేస్తున్నట్టు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. రిజర్వు స్థలాన్ని ఏ విధంగా వినియోగించాలన్నది నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయించాలి. కానీ లేఅవుట్ యజమాని తన కస్టమర్లను ఆకర్షించడానికి రిజర్వు స్థలాల్లో టెన్నిస్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్ పార్కు నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ ఒక్కో ప్లాట్ ధరను రూ.70 లక్షల నుంచి రూ.కోటిగా నిర్ణయించి వ్యాపారం చేస్తున్నట్టు నగరంలో చర్చ జరుగుతోంది. రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ చట్టం) నిబంధనల ప్రకారం లేఅవుట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాతే ప్లాట్లు విక్రయించాల్సి ఉండగా దాన్ని పట్టించుకోకుండా ఇప్పుడే అమ్మేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపైనా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన అధికారులంతా కేవీఆర్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవారేనని విమర్శలు ఉన్నాయి. విచారణలో కీలకంగా వ్యవహరించే మైన్స్, రెవెన్యూ అధికారులు కేవీఆర్ మోచేతి నీళ్లు తాగిన వారేనంటున్నారు. వీరి వల్ల విచారణ పారదర్శకంగా సాగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడిగా కేవీఆర్ వ్యవహరించారు. వైకాపా నుంచి పోటీ చేసిన దువ్వాడ శ్రీనుకు నిధుల సమీకరణ కోసం ఆ ప్రాంతంలో ఉన్న క్రషర్లు, గ్రానైట్ ఇండస్ట్రీ మీద పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకువచ్చారని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. దీంతో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అచ్చెన్నాయుడు క్రషర్లు, గ్రానైట్ తరలింపును నిలిపివేయించారు. ఆ తర్వాత మిగిలినవారికి సడలింపు ఇచ్చినా కేవీఆర్ కనుసన్నల్లో నడిచిన క్రషర్లను ఇప్పటికీ ఆపే ఉంచారు. గ్రానైట్ వ్యాపారం మాత్రం నడుస్తోంది.

## ఆసరా లేని చిన్నారులకు స్టేషనరీ పంపిణీ

(సత్యంన్యూస్, టెక్కలి)

ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన స్వర్గీయ డాక్టర్ కంచరాపు త్రినాధరావు జ్ఞాపకార్థం ఆయన బావమరిది సనపల నాగభూషణరావు ఆసరాలేని పిల్లలకు సాయం చేయాలనే ఆలోచనతో టెక్కలి అభయం యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆదిఆంధ్ర వీధి మిరియం చిల్డ్రన్ హోంలోని 37మంది చిన్నారులకు విద్యాసామాగ్రిని అందించారు. కార్యక్రమంలో అభయం యువజన సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావుతోపాటు సంఘ సభ్యులు అద్దాల వీరభద్రాచారి, మున్నా పాల్గొన్నారు




## మీ ఆరోగ్యం మా బాధ్యత

**- పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే శంకర్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యతని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం బాపూజీ కళామందిరంలో ఈఎస్ఐ ఆసుపత్రి, జెమ్స్ సంయుక్తంగా నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ పారిశుధ్య కార్మికులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నిత్యం అపారిశుధ్య వాతావరణంలో తిరుగుతూ బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విళయతాండవం చేస్తున్న సమయంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి సేవలందించారని అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం పట్ల తనకు ఎంతో చిత్తశుద్ధి ఉందని, వారికి ఏ సమస్య వచ్చినా చేసేందుకు తాను ముందుంటానని తెలిపారు. ప్రభుత్వ పరంగా పారిశుధ్య కార్మికులకు అందాల్సిన సౌకర్యాలకు తాను బాధ్యత వహిస్తానని చెప్పారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై బాధ్యతకు ఈఎస్ఐ, జెమ్స్ ఆసుపత్రుల సంయుక్తంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇన్‌ఛార్జి కమిషనర్ చల్లా ఓబులేశు, జెమ్స్ ఆర్ఎంఓ ప్రవీణ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## రిమ్స్ అన్నపూర్ణకు రూ.10వేలు విరాళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భైరివానిపేటకు చెందిన కొమనాపల్లి సురేష్ పుట్టినరోజు సందర్భంగా రిమ్స్ సత్యసాయి నిత్య అన్నపూర్ణ సంఘం నిర్వహిస్తున్న నిత్యనారాయణ సేవకు రూ.10వేలు విరాళంగా సంస్థ సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావుకి అందజేసినట్లు సంస్థ అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్ర రావు తెలిపారు. ఈ సందర్భంగా కొమనాపల్లి సురేష్ మాట్లాడుతూ రోగుల సహాయకులకు మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా నిస్వార్థంగా అందిస్తున్న సేవలను అభినందిస్తూ విరాళాన్ని అందచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణబాబు, రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బరిలో టీడీపీ లేనట్టేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఒక నిర్ణయం తీసుకోలేని వాతావరణంలోనే చంద్రబాబునాయుడు కమిటీలంటుంటారు. ఇప్పుడు ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలో కూడా కమిటీ వేశారంటే, దానర్థం పోటీలో ఉండరనే. గణాంకాలు చూసుకున్నా (ఎక్స్ అఫీషియో సభ్యులతో సహా) 838 మంది ఓటర్లలో 235 నుంచి 240 లోపు ఓటర్లు మాత్రమే టీడీపీకి ఉన్నారు. మొత్తం ఓటర్లలో 636 మంది ఎంపీటీసీలు, 36 మంది జెడ్పీటీసీలు, 97 మంది కార్పొరేటర్లు, 28 మంది నర్సీపట్నం కౌన్సిలర్లు, 25 మంది యలమంచిలి కౌన్సిలర్లు ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. అయితే ఇందులో కీలకం అరుకు, పాడేరు ప్రాంతాలకు చెందిన ఓటర్లే. వీరిని బెంగళూరుకు తరలించి క్యాంప్ నడుపుతున్నారు. పోలింగ్ రోజున తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో భీమిలీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తమ ఓటర్లను చీల్చకుండా బొత్స సత్యనారాయణ నేరుగా పర్యవేక్షిస్తుండగా, యలమంచిలి, పెందుర్తి, అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు క్యాంప్ రాజకీయాలు నడుపుతున్నారు. ప్రస్తుతం వైకాపా ఓటర్లెవరూ టీడీపీకి అందుబాటులో లేరు. దీంతో బరిలో నిలిచినా ప్రయోజనం ఉండదని టీడీపీ భావిస్తోంది. ఇదే విషయాన్ని చంద్రబాబు సమీక్షలో కొందరు సీనియర్లు చెప్పుకొచ్చారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.